ఆది వారం
29-10-2023
సంపుటి - 08,
సంచిక - 374
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## 55 ఏళ్లపాటు కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే ఏం చేసింది

- ఏపిలో కుప్పకూలింగి.. ఇక మిగిలింది తెలంగాణలోనే
- మీట్‌ది ప్రెస్‌లో మంత్రి కెటిఆర్




**హైదరాబాద్, అక్టోబర్ 28(సమ సమాజం):** ఏపీలో కాంగ్రెస్ కుప్పకూలిందని, తెలంగాణలోనైనా 4 సీట్లు వస్తాయని ఆ పార్టీ ఆరాటమని మంత్రి కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్‌కు ప్రజలు 55 ఏండ్లపాటు అవకాశం ఇచ్చారని చెప్పారు. కేంద్రంలో బీజేపీకి ప్రజలు పదేండ్లు అవ కాశం ఇచ్చారని చెప్పారు. ఇరుపార్టీలకు ఏండ్ల తరబడి అవకాశం ఇచ్చినా అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. అభివృద్ధి ఆధారంగా తాము ఓట్లు అడుగుతున్నామని చెప్పారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని 4వ పేజీలో...

## పదవుల కోసం దిగజారిన తుమ్మల
## మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



**ఖమ్మం,అక్టోబర్ 28(సమ సమాజం):** పదవుల కోసం మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధమస్థాయికి దిగజారారని మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. కేసీఆర్ గురించి తమ్ముల ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం బాధాకరమన్నారు. 2014లో మంత్రి పదవి ఇచ్చి ఉండకపోతే తమ్ముల ఇంటికే పరిమితమయ్యేవారని విమర్శించారు. ఖమ్మంలో బీఆర్ఎస్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్రతో కలిసి మంత్రి పువ్వాడ అజయ్ మీడియాతో మాట్లాడారు. తుమ్మలపై ఆధారపడి కేసీఆర్ అధికారంలోకి వచ్చారా అని 3వ పేజీలో...

## హారన్ కొడితే హత్యాయత్నం చేస్తారా : నారా లోకేశ్



**అమరావతి, అక్టోబర్ 28(సమ సమాజం):** వైసీపీ అధినేత, సీఎం జగన్మోహన్ రెడ్డి తన అవినీతి దందాలకు అడ్డొస్తున్నారని సొంత బాబాయ్ వివేకను వేసేస్తే, ఆయన సైకో ఫ్యాన్స్ హారన్ కొట్టారని ఆర్టీసీ డ్రైవర్‌పై హత్యాయత్నం చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ఉదయం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లా, కావలిలో రోడ్డుపై అడ్డంగా ఉన్న బైక్ తీయాలని ఆర్టీసీ బస్సు డ్రైవర్ బీఆర్ సింగ్ హారన్ కొట్టడమే నేరమైందన్నారు. నడిరోడ్డుపై 4వ పేజీలో...

## వచ్చే ఎన్నికలల్లో బిజెపి కాంగ్రెస్ కనుమరుగు

సంక్షేమాన్ని అడ్డుకోవాలని చూస్తే మీరే అంతమవుతారు : మంత్రి సత్యవతి రాథోడ్



**మహబూబాబాద్, అక్టోబర్ 28(సమ సమాజం):** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు కనుమరుగవడం ఖాయమని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రైదుబంధు నిలిపివేయాలని, సంక్షేమ పథకాలు ఆపాలంటూ ఎన్నికల సంఘానికి కాంగ్రెస లేఖ రాయడంపై అన్నదాతలు, ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని విమర్శించారు. గిరిజనులను అవమానించిన పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే శంకర్ నాయక్‌తో కలిసి మంత్రి సత్యవతి 4వ పేజీలో...

## బిఆర్ఎస్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్‌కు లేదు

రేవంత్ మాటలను ప్రజల గమనించాలి : మంత్రి హరీశ్‌రావు



**ఆదిలాబాద్, అక్టోబర్ 28(సమ సమాజం):** 55 ఏళ్లు పాలించి తెలంగాణకు ఏమి చేయలేని కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్‌ను విమర్శించే స్థాయి లేదని, నాడు కరెంటు ఉంటే వార్త... నేడు తెలంగాణ లో కరెంటు పోతే వార్త అని మంత్రి హరీష్ రావు అన్నారు. ఉట్నూర్‌లో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో కేవలం 3 గంటల కరెంటు మాత్రమే ఇస్తున్నారన్నారు. 3గంటల కరెంటు చాలని రేవంత్ రెడ్డి పేర్కొనడం దుర్మార్గమన్నారు. 24 గంటల కరెంటు కావాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలన్నారు. బీజేపీ వాళ్ళు కరెంటుకు మీటర్లు పెట్టాలని, బిల్లులు వసూలు చేయాలని అంటున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. కేసీఆర్ మాత్రం ఒప్పు కోవడం లేదని.. అందుకే రాష్ట్రంపై 3వ పేజీలో...

# ఎన్నికల వేళ గుర్తుల మాయ!

**హైదరాబాద్, అక్టోబర్ 28(సమ సమాజం):** ఎన్నికలనగానే గుర్తుకొచ్చేది పార్టీల గుర్తులు. పార్టీల అభ్యర్థు లకు, ఇండిపెండెంట్లకు ఎన్నికల సంఘం గుర్తులు కేటాయిస్తుంది. అయితే ఒక్కోసారి ఈ గుర్తులు కూడా తారుమారవుతుంటాయి. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల నాటికే 'హస్తం' గుర్తు ఉంది. అయితే అప్పుడది కాంగ్రెస్ ఎన్నికల గుర్తుగా లేదు. ఆ పార్టీ ఎంపీ అభ్యర్థులంతా దేశవ్యాప్తంగా 'కాడెద్దులు' గుర్తుతో బరిలోకి దిగారు. కమ్యూనిస్టులు ఒక్క హైదరాబాద్ స్టేట్ మినహాయిం చి దేశవ్యాప్తంగా 'కంకికొడవలి' గుర్తుపైనే పోటీ చేశారు. అప్పట్లో హైదరాబాద్ స్టేట్‌లో కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధం ఉండేది. వారంతా అజ్ఞాతంలో ఉంటూ రాజకీయ కార్యకలాపాలు కొనసాగిం చేవారు. ఎన్నికల్లో ప్రజాతంత్ర కూటమి(పీడీఎఫ్) పేరుతో పోటీ చేశారు. నాటి నిబంధనల ప్రకారం స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించే 'చేయి' గుర్తును పీడీఎఫ్‌కు ఇచ్చారు. తర్వాత కాలంలో కమ్యూనిస్టులు సీపీఐ, సీపీఐ(ఎం)గా విడిపోయారు. ఎన్నికల సంఘం... సీపీఐకి కంకి-కొడవలి, సీపీఐ(ఎం)కి సుత్తి-కొడవలి, నక్షత్రం గుర్తులను కేటాయించింది. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిపోవడంతో ఒక వర్గానికి 'చేయి' గుర్తును, మరో వర్గానికి



3వ పేజీలో...

# కాంగ్రెస్‌లో చిచ్చురేపుతున్న రెండో జాబితా



**హైదరాబాద్, అక్టోబర్ 28(సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీలో రెండో జాబితా చిచ్చురేపుతున్నది. ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేసిన తమను కాదని మరొకరికి టికెట్లు కేటా యించడంతో ఆశావహులు తీవ్ర అసంతృప్తితో ఊగిపోతున్నారు. పార్టీ అధినాయకత్వంతో తాడోపేడో తేల్చుకుంటామంటూ ప్రకటిస్తున్నారు. తమ అనుచరులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల లేదా నారాయణపేటల్లో సీటు ఆశించిన ఎర్రశేఖర్.. తనకు పోటీచేసేందుకు అవకాశం కల్పించకపోవడం తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. మరికాసేపట్లో తన అనుచరుగణంతో సమావేశం కానున్నారు. వనపర్తిలో చిన్నారెడ్డికి టికెట్ రావడంతో మేఘారెడ్డి ఆగ్రహంతో ఉన్నారు. దేవరకద్ర టికెట్ ఆశించిన ప్రదీప్‌కుమార్ గౌడ్‌కు భంగపాటు తప్పలేదు. అక్కడ మదన్‌రెడ్డికి పార్టీ టికెట్ ఇచ్చింది. కామారెడ్డి కాంగ్రెస్‌లో అసంతృప్తి నెలకొన్నది. ఆ పార్టీ సీనియర్ నేత సుభాష్ రెడ్డి టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆయనను కాదని మదన్‌మోహన్ రావుకు అధిష్ఠానం సీటు కేటాయించడంతో ఆయన ఆగ్రహంతో ఉన్నారు. ఇన్నాళ్లు నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసినప్పటికీ తనను గుర్తించలేదంటూ ఊగిపోతున్నారు.

## సిఎం కెసిఆర్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే నవ్వొస్తోంది : పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

డబ్బు, అహంకారం, అధికార మదం బిఆర్ఎస్‌కు ఉంది



**ఖమ్మం జిల్లా, అక్టోబర్ 28(సమ సమాజం):** కాంగ్రెస్ ప్రచార కమిటీ కో-కన్వీనర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సీఎం కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఖమ్మం, సంజీవరెడ్డి భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా ఉందని, సీఎం నిన్నటి సభలో ఆయన పక్కన కూర్చుంది ఎవరు? ఆయన ఏ పార్టీ ఎమ్మెల్యే అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక అర్హత కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు లేదన్నారు. "డబ్బు అహంకారంతో అధికార మదంతో విర్రవీగే కేసీఆర్ మీరా ప్రజా స్వామ్యం గురించి మాట్లాడేది.. 3వ పేజీలో...

## రూ. 20 కోట్లు ఇవ్వకుంటే చంపేస్తాం

### ముకేశ్ అంబినికి బెదిరింపులు



**ముంబై, అక్టోబర్ 28(సమ సమాజం):** రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మెన్ ముకేశ్ అంబానీని చంపేస్తామని బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ-మెయిల్ ద్వారా ఓ వ్యక్తి బెదిరించాడు. తమకు 20 కోట్లు ఇవ్వకుంటే, చంపేస్తామని ఆ మెయిల్‌లో హెచ్చరించారు. తమ వద్ద బెస్ట్ షూటర్స్ కూడా ఉన్నట్లు 3వ పేజీలో...

## సామాన్యులకు గుదిబండగా నిత్యావసరాలు

పెరుగుతున్న ఉల్లిగడ్డ ధరలు • ఢిల్లీలో కిలో ఉల్లిగడ్డ ధర రూ. 80

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (సమ సమాజం):** ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో సాధారణ, మధ్యతరగతి ప్రజలు చుక్కలు చూస్తున్నారు. వాటికి ఉల్లిగడ్డ కూడా తోడవడంతో వంటింట్లో పొయ్యి వెలిగించాలంటే ఆలోచిస్తున్నారు. మొన్నటిదాగా కిలో రూ. 20-30 పలికిన కిలో ఉల్లిగడ్డ ధర ఢిల్లీలో ఇప్పుడు ఏకంగా రూ.80కి 3వ పేజీలో...



## ఉల్లి ధరల రెక్కలు కత్తిరించిన కేంద్రం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (సమ సమాజం):** పెరుగుతున్న ఉల్లి ధరలకు కళ్లెం వేసి వినియోగదారులకు ఊరట కలిగించేందుకు కేంద్రం రంగంలోకి దిగింది. శుక్రవారం ఉల్లి ధరలు దేశవ్యా ప్తంగా కిలో ఏకం గా 47 రూపాయలకు చేరాయి. దాంతో గోదాముల్లోని అదనపు నిల్వలను కిలో రూ.25కే విక్రయిం చాలని కేంద్రం నిర్ణయించింది. ముఖ్యంగా ఉల్లి ధర ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో అదనపు నిల్వలను 25 రూపాయల సబ్సిడీ ధరకే టోకు, రిటైల్ మార్కెట్లలోకి విడుదల చేస్తున్నట్టు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రోహిత్‌కుమార్ సింగ్ తెలిపారు. ఇలా ఆగస్టు నుంచి ఇప్పటిదాకా 22 రాష్ట్రాల్లో ఏకంగా 1.7 లక్షల 3వ పేజీలో...

# కరెంట్ సరఫరా చుట్టూ తిరుగుతున్న రాజకీయం

రేవంత్ అన్న మాటలను క్యాష్ చేసుకుంటున్న బిఆర్ఎస్

రైతులకు 24 గంటల సరఫరా అసలైన బిఆర్ఎస్ అస్త్రం

కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాలను తెరపైకి తెస్తున్న బిఆర్ఎస్ నేతలు



**హైదరాబాద్, అక్టోబర్ 28(సమ సమాజం):** దేశాన్ని దాదాపు 60 ఏండ్లపాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. ఏనాడుకూడా.. దేశం మొత్తం కాదు.. ఏ రాష్ట్రంలోకూడా 24 గంటల కరెంటు ఇచ్చిన సందర్భం లేదు. ఎక్కడ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా.. అక్కడ కరెంటు వ్యవస్థలను కుప్పకూల్చి.. ప్రజలకు విద్యుత్తు కష్టాలు, బాధలను రుచి చూపించిగానీ వదలని ఏలినాటి శని కాంగ్రెస్ పార్టీ. కేవలం విద్యుత్తుపైనే ఆధారపడిన రైతాంగానికి చుక్కలు చూపించి.. పంటలను ఎండబెట్టి.. రైతులను అప్పులపాల్జేసి.. వారు బలవన్మరణానికి గురైతేగానీ.. అధికారంలో ఉండే కాంగ్రెస్ పార్టీ నేతల మనస్సులు చల్లారవు. ఇచ్చే రెండు, 3 గంటల విద్యుత్తు అయినా.. రాత్రనక పగలనకా ఇచ్చి రైతుల ప్రాణాలను విషపురుగులు, పాములు, తేలు కాట్లకు బలి ఇచ్చేలా పరిస్థితులను సృష్టించేదే కాంగ్రెస్ పార్టీ. ఇందుకు ఉదాహరణలు కోకొల్లలు. పైగా విద్యుత్తుపై కాంగ్రెస్ నాయకులకు ఎవరికీ సరైన అవగాహన లేదు. ఎవరికి ఎన్ని గంటలు అవసరం.. దానిని ఎలా ఉత్పత్తి చేయాలి.. ఎలా సరఫరా చేయాలి.. వ్యవస్థలను ఎలా బలోపేతం చేయాలనే ఆలోచనలే వారికి రావు. సమైక్య రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా కాంగ్రెస్ పార్టీ అధికారానికి వచ్చినప్పుడు ఏడుగంటల పాటు విద్యుత్తును వ్యవసాయానికి అందిస్తామని నమ్మకంగా చెప్పారు. కానీ అప్పటి కాంగ్రెస్ 10 సంవత్సరాల పరిపాలనలో.. ఏనాడుకూడా 7 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్తును అందించిందీ లేదు. ఐదు గంటలు విద్యుత్తు ఇస్తే అదే మహా ప్రసాదం అనే పరిస్థితి నెలకొంది. ఆ ఐదు గంటలుకూడా మూణ్నాలుగు విడతలుగా.. అదికూడా అర్ధరాత్రి ఇచ్చే సంస్కృతికి బీజం వేసింది కాంగ్రెస్ పార్టే. కరెంటు సరిగ్గా ఇవ్వక.. ఇచ్చినా లోవోల్టేజీతో మోటర్లు కాలిపోయేవి..ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేవి. విద్యుత్తు శాఖ దగ్గర సరిపోయినంత సిబ్బందికానీ.. ట్రాన్స్‌ఫార్మర్లుగానీ ఉండేవి కాదు. దీనితో రైతులే చందాలేసుకుని వాహనాల్లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకుని.. ఎమ్మెల్యేతోగానీ, మంత్రితోగానీ సిఫార్సు చేయించి.. ఆమ్యామ్యాలిస్తేనే ట్రాన్స్‌ఫార్మర్ మూణ్నాలుగు రోజుల తరువాత తిరిగి వచ్చేది. ఈలోపు పంటలన్నీ ఎండిపోయేవి. ఇక రాత్రిపూట వచ్చే విడతల కరెంటు కోసం.. రైతులు పొలాల దగ్గర, చేలల్ల నిద్రించేవారు. దీనితో పాములు, తేళ్లు, విషపురుగుల కాట్లకు గురై చనిపోయిన రైతులు వందల సంఖ్యలో ఉన్నారు. విద్యుత్తు శాఖ అధికారుల దిగ్బంధనం, సబ్ స్టేషన్ల ముట్టడి, ప్రజాప్రతినిధుల అడ్డగింపు, నిలదీతలు.. పోలీసు కేసులు, స్టేషన్లలో రైతన్నల అరెస్టులు షరా మామూలుగానే ఉండేవి. విద్యుత్తు కోతలతో ఎండిపోయిన పంటలను అసెంబ్లీలో ప్రదర్శించడం ఆనవాయితీగా మార్చింది కాంగ్రెస్ పార్టీయే. మొన్నటికి మొన్న మన పక్క రాష్ట్రమైన కర్ణాటకలో ఎన్నికలు జరిగితే ప్రజలు నమ్మి కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. మొదట్లో ఏడు గంటలన్నారు. కానీ ఆఖరికి ఐదు గంటలు కచ్చితంగా.. నిరంతరాయంగా ఇస్తామంటూ సీఎంతోపాటు విద్యుత్ శాఖ మంత్రి కేజే జార్జ్ ప్రకటన చేశారు. షరా మామూలుగానే కాంగ్రెస్ పార్టీ నరనరాన జీర్ణించుకున్న.. కరెంట్‌ను కటకట చేయడంలో సఫలం అయ్యింది అక్కడి ప్రభుత్వం. ఇప్పుడు కర్ణాటకలో ఎక్కడ చూసినా.. రైతాంగం ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నాలు చేస్తున్నారు. విద్యుత్తు శాఖ అధికారులను నిలదీస్తున్నారు.. నిర్బంధిస్తున్నారు. సబ్ స్టేషన్లను దిగ్బంధిస్తున్నారు. కనీసం ఐదు గంటలుకూడా ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు ఎన్నుకున్నాంరా భగవంతుడా అంటూ.. తమను తామే నిందించుకుంటున్నారు. ఇక మన రేవంత్‌రెడ్డి.. కాదు కాదు.. రేటెంత రెడ్డి అన్న మాటలు చూస్తే.. అసలు వీళ్లకు కరెంటుపై అవగాహన ఉందా.. వ్యవసాయం గురించి తెలుసా.. అనే అనుమానాలు రాకమానవు. రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా మూడు గంటల విద్యుత్తు ఇస్తే.. మళ్ళీ మనం ఎక్కడికి పోతామనేది ప్రజలు గుర్తించుకోవాలి. ఏడు గంటలని చెప్పి.. ఐదు గంటలుకూడా సరిగ్గా ఇవ్వలేని కాంగ్రెస్ పాలనను చవిచూసి.. చావుతప్పి కన్నులొట్టపోయిన తెలంగాణ రైతాంగం.. ఇప్పుడు మూడు గంటలు చాలంటున్న కాంగ్రెస్ నేతలను గెలిపిస్తే.. ఎలాంటి ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్టో అర్థం చేసుకోవాలి. పాముకు పాలు పోసి పెంచితే.. కాటు వేయక మానుతుందా.. తప్పకుండా కాటు వేస్తుంది. అలాగే మూడు గంటల విద్యుత్తు మాత్రమే అందిస్తే.. ఇప్పుడిప్పుడే దిద్దుకుంటున్న తెలంగాణ సమాజంలో.. నిప్పులు పోసినట్టే. మళ్ళీ కరెంటు కోతలు తప్పవు. పంటలు ఎండిపోవటం ఖాయం. మోటర్లు కాలడం.. ట్రాన్స్‌ఫార్మర్లు పేలడం చూడాల్సిందే. విద్యుత్తు కోతలు, పరిశ్రమలకు వాతలు.. గృహ, వినియోగదారులు నిద్రలేని రాత్రులు.. వాణిజ్య వినియోగదారులు ఈగలు తోలుకుంటూ బతకాల్సిన దుస్థితి రాకమానదు. ఒక రైతుకు కనీసం ఎంత విద్యుత్తు అవసరం అనేదే సరిగ్గా తెలియని నేతలకు పాలనా పగ్గాలు అప్పగిస్తే.. రాష్ట్రం మొత్తం విద్యుత్తు అవసరాలను ఎలా తీర్చుతారు? తెలంగాణ రైతాంగం ముందుగానే గ్రహించి జాగ్రత్త పడాలి. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఆగం కావడం ఖాయమనేది ఆలోచించి.. రైతాంగం ఆగం కాకుండా.. ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక మూడు గంటల కరెంటు కావాలా.. 24 గంటల నిరంతరాయ పూర్తి ఉచిత విద్యుత్తు కావాలా అనేది రైతాంగమే నిర్ణయించుకోవాలి.

# ప్రగతి సిరుల పాలకుర్తి

ఎర్రబెల్లి హయాంలోనే అభివృద్ధిపథంలో పరుగులు



**పాలకుర్తి, అక్టోబర్ 28(సమ సమాజం):** ప్రకృతి రమణీయతతో సిరులు కురిపించే పాడిపంటలకు నెలవు పాలకుర్తి. ఘనమైన త్రిలింగ, తెలంగాణ సారస్వత, చారిత్రక వారసత్వానికి ప్రతీక. సీఎం కేసీఆర్ ప్రగతి పాలనలో జనం మెచ్చిన నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు సారథ్యంలో ప్రగతికి కేరాఫ్‌గా పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి చెందుతున్నది. 1994లో అప్పటి వర్ధన్నపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్రబెల్లి దయాకర్ రావు 2009లో పాలకుర్తిలో పాగావేశారు. వరుసగా మూడుసార్లు విజయం సాధించారు. సంక్షేమంతోపాటు ప్రగతి ఫలాలనూ ప్రజలకు చేరువ చేస్తూ.. నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ కంచుకోటగా మలిచారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో పాలకుర్తి ? బమ్మెర ? వల్మిడి కారిడార్‌గా అభివృద్ధి చేస్తున్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లకు రూ. 163 కోట్లు మంజూరు చేశారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు 33 వేల 29 ఎకరాలు మాత్రమే సాగునీటి సౌకర్యం ఉండగా, నేడు 77 వేల 67 ఎకరాలకు పెంచారు. మిషన్ కాకతీయ ద్వారా 331 చెరువులను అభివృద్ధి చేశారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ పరిధిలో 79.59 కిలోమీటర్ల మేర కాల్వల నిర్మాణం చేపట్టారు. యశ్వంతాపూర్, దేవరుప్పుల, పాలేరు, ఆకేరు వాగులపై 27 చెక్ డ్యాంలను నిర్మించారు. దీంతో భూగర్భజలాలు పెరిగాయి. రైతుబీమా పథకంలో 1,027 కుటుంబాలకు సాయం అందించారు. ఆరు మండలాల్లో రైతు వేదికలను నిర్మించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద 9,162 మంది లబ్ధిదారులకు రూ.87.1 కోట్లు అందజేశారు. మిషన్ భగీరథ ద్వారా నియోజకవర్గంలోని 442 ఆవాసాలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. 104 ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించారు. 4,561 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి పేదలకు అందజేశారు. 56 నూతన గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించారు. 10 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నారు. వేలాది మందికి కేసీఆర్ కిట్లు అందజేశారు. ఆరు మండలాల్లోని 177 గ్రామాల్లో వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. తొర్రూరు, దేవరుప్పుల, కొడకండ్ల శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. సెంట్రల్ లైటింగ్, డివైడర్ల విస్తరణ, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, మార్కెట్లు, పార్కులు ఏర్పాటు చేశారు. 352.41 కి.మీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తిచేశారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మెటల్‌రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. 181 కి.మీ డబుల్ రోడ్లు, రూ.143 కోట్ల 24 లక్షలతో బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేశారు. తండాలకు రూ.8 కోట్ల 65 లక్షల వ్యయంతో బీటీ రోడ్లు నిర్మించారు.

# జగన్ పోతనే రాష్ట్రానికి పీడ విరగడ నారా లోకేశ్



**అమరావతి, అక్టోబర్ 28(సమ సమాజం):** సైకో జగన్ పోతేనే ఏపీకి పట్టిన పీడ విరగడవుతుందని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. శనివారం నాడు టీడీపీ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ "జగన్‌రెడ్డి తన అవినీతి దందాలకు అడ్డొస్తున్నారని సొంత బాబాయ్‌ని చంపితే, ఆయన సైకో ఫ్యాన్స్ హారన్ కొట్టారని ఆర్టీసీ డ్రైవర్‌పై హత్యాయత్నం చేశారు. కావలిలో రోడ్డుకి అడ్డంగా ఉన్న బైక్ తీయాలని ఆర్టీసీ బస్సు డ్రైవర్ బీఆర్ సింగ్ హారన్ కొట్టడమే నేరమైంది. నడిరోడ్డుపై పట్టపగలు వైసీపీ నేతలు గూండాల కంటే ఘోరంగా ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేశారు. ఆంధ్రప్రదేశ్ సైకో జగన్ ఫ్యాక్షన్ ప్రదేశ్‌గా మారిపోయింది. సైకో జగన్ పోతేనే, ఇలాంటి పిల్ల సైకో గ్యాంగులన్నీ పోతాయి" అని నారా లోకేష్ మండిపడ్డారు.

# పార్టీలో హాఫ్ టిక్కెట్లుగాళ్లకు కూడా టిక్కెట్లు ఇచ్చారు : పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 28(సమ సమాజం):** జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, దివంగత పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై హాట్ కామెంట్స్ చేశారు. హాఫ్ టికెట్‌గాళ్లకు కూడా టికెట్లు ఇచ్చారంటూ ఫైర్ అయ్యారు. ప్రజలకు దండాలు పెట్టేవారికి కాకుండా నాయకులకు దండాలు పెట్టేవారికి మాత్రమే కాంగ్రెస్ పార్టీలో టికెట్లు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశం ఉన్న ఏకైక స్థానం జూబ్లీహిల్స్ అని.. అలాంటి సీటును నియోజకవర్గంతో సంబంధంలేనివారిక ఇచ్చారణి ఫైరయ్యారు. తనకే టికెట్ ఇస్తానని మాణిక్‌రావ్ థాక్రే కూడా చెప్పారని, తీరా జాబితాలో తన పేరు లేకపోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. తాను చాలా రోజులుగా ఇంటింటి ప్రచారం చేస్తున్నానని వెల్లడించారు. ఎస్సీ, బీసీ, సెటిలర్స్ ఓట్లు అత్యధికంగా ఉన్న జూబ్లీహిల్స్‌లో కేవలం ఒక కమ్యూనిటీ కోసం టికెట్ ఇవ్వడం దారణమన్నారు. ఒకే ఇంట్లో రెండు టికెట్స్ ఇవ్వమనే వాదన నిజమైతే.. దానికి విరుద్ధంగా ఎంతో మందికి ఇచ్చారని విమర్శించారు. హైదరాబాద్‌లో పీజేఆర్ లాంటి నాయకుడి కుటుంబానికి టికెట్ ఇస్తే తప్పేందని ప్రశ్నించారు. తాను కచ్చితంగా జూబ్లీహిల్స్ నుంచి పోటీచేస్తానని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు రెండో పెళ్లికి ప్రభుత్వ షరతులు



**గౌహతి, అక్టోబర్ 28(సమ సమాజం):** అసోం ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. జీవిత భాగస్వా మి జీవించి ఉండగా ప్రభుత్వ అనుమతి లేకుండా రెండో వివాహం చేసుకోవడానికి వీల్లేదని ప్రభు త్వ ఉద్యోగులకు సర్కార్ కీలక ఆదేశాలు చేసింది. వారి వారి వ్యక్తిగత మతాల అనుమతి ఉన్నప్ప టికీ, రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేనిదే రెండో పెళ్లి చేసుకోవడం కుదరదని తెగేసి చెప్పింది. అలాగే ఏ మహిళా ప్రభుత్వ ఉద్యోగి కూడా తమ భర్త బతికి ఉండగా ప్రభుత్వ అనుమతి లేకుండా పెళ్లి చేసుకోకూడదని అసోం ప్రభుత్వం స్పష్టం చేసింది. ముస్లింల ప్రస్తావన లేకుండా, వ్యక్తిగత చట్టం ద్వారా పలు వివాహాలు చేసుకోవడానికి అనుమతి ఉన్న పురుషులకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని సర్క్యులర్‌లో పేర్కొంది, ఈ మేరకు అసోం సర్కార్ అక్టోబర్ 20న ఆఫీసు మెమోలో ఈ సూచనలను జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి రావడం విశేషం. ఇక, ప్రభుత్వ ఉ ద్యోగి ఎవరైనా బహు భార్యత్వం కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని బీజేపీ నేత, అసోం ముఖ్యమంత్రి హిమాంత బిస్వా శర్మహెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగి మరణా నంతరం భర్త పెన్షన్ కోసం ఇద్దరు భార్యలు గొడవపడే సందర్భాలని గుర్తు చేశారు. ఈ నేపథ్యం లోనే ఈ నిర్ణయం తీసుకున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాగా ఈ ఏడాది ప్రారంభంలో, అ సోం బహుభార్యత్వాన్ని తక్షణమే నిషేధించాలనుకుంటున్నామనే అభిప్రాయాన్ని సీఎం ప్రకటిం చారు. సెప్టెంబర్‌లో జరిగే తదుపరి అసెంబ్లీ సమావేశాలలో బిల్లును ప్రవేశ పెట్టాలనుకుంటున్నా మని, అనివార్య కారణాల వల్ల అది సాధ్యం కాకపోతే జనవరి సెషన్‌లో ప్రవేశపెడతామని శర్మ చెప్పారు. అలాగే ప్రతిపాదిత చట్టంపై ఆగస్టులో ముఖ్యమంత్రి ప్రజాభిప్రాయాన్ని కోరారు. దీంతోపాటు బహుభార్యత్వాన్ని నిషేధించే చట్టం అమలుకు సంబంధించి రాష్ట్ర శాసనసభకున్న అర్హత విషయంలో అసోం ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయగా, దీనికి కమిటీ నివేదిక ఆమోదం లభించినట్టు ప్రభుత్వం తెలిపింది.

# బతికి ఉన్న ఆక్టోపస్ వంటకం తిని ప్రాణాలు పోగొట్టుకున్నాడు!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (సమ సమాజం):** కొన్ని దేశాలలో కొన్ని వింత ఆహార అలవాట్లు ఉంటాయి. అయితే అవే ఒక్కోసారి ప్రాణాలు తీస్తాయి. దక్షిణ కొరియాకు చెందిన ఓ వృద్ధుడు అలాగే లైవ్ ఆక్టోపస్ వంటకాన్ని తిని నిమిషాల్లో ప్రాణాలు కోల్పోయాడు. ఆక్టోపస్ మెలికలు తిరిగే పార్శ్వాం గాలతో చూడటానికి కొంత భయంకరంగానే ఉంటుంది. తమకు ఆహారంగా ఉపయోగపడే జీవులపై దాడి చేసి చంపి తినేందుకు ఆక్టోపస్‌లు ఆ పార్శ్వాంగాలను వినియోగించుకుంటాయి. అయితే దక్షిణ కొరియాకు చెందిన 82 ఏళ్ల వృద్ధుడు ఆక్టోపస్‌లతో చేసే ప్రముఖ 'సాన్ నాజ్కి' అనే వంటకం రుచి చూసి మృతిచెందాడు. ప్రాణంతో ఉన్న ఆక్టోపస్‌ను ముక్కలుగా కోసి దానిపై నువ్వులు, కొన్ని రకాల మసాలాలను కలిపితే ఈ సాన్ నాజ్కి వంటకం రెడీ అవుతుంది. ఆ వృద్ధుడు కూడా ఇలాగే తయారు చేసిన సాన్ నాజ్కి వంటకాన్ని ఆరగించాడు. అయితే అతను తింటున్నప్పుడు ఆ ఆక్టోపస్ పార్శ్వాంగ ముక్కలు కదులుతూనే ఉన్నాయి. దాంతో ఆక్టోపస్ పార్శ్వాంగం ముక్క ఒకటి మెలిక లు తిరుగుతూ ఆ వృద్ధుడి గొంతులో ఇరుక్కుపోయింది. తర్వాత ఊపిరాడక కార్డియాక్ అరెస్ట్‌కు గురై ఆ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ లైవ్ ఆక్టోపస్ రెసిపీని 2003లో దక్షిణ కొరియాలో ఓ సినిమా నటుడు చేసి చూపించటంతో ఒక్కసారిగా ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

# ఇంధనం కోసం 100 కి.మీ. వెనక్కి వెళ్లిన రైలింజిన్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (సమ సమాజం):** రెండు రైల్వే డివిజన్ల మధ్య నెలకొన్న వివాదంతో.. సరిపడ ఇంధనం లేని ఓ రైలింజిన్ వెనక్కు వచ్చి దాని మాతృ డివిజన్‌లో ఇంధనం నింపుకొన్న ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. ఈ నెల 21న ఆగ్రా డివిజన్‌కు చెందిన మథుర నుంచి ఓ రవాణా రైలు మధ్యాహ్నం మూడు గంటలకు జైపుర్‌కు బయలుదేరింది. డీగ్ స్టేషన్ వద్ద ఆ రైలుకు సంబంధించిన విద్యుత్ ఇంజిన్ స్థానంలో డీజిల్ ఇంజిన్‌ను అమర్చారు. అయితే ఉట్‌వాడ్ స్టేషన్‌కు చేరుకునేసరికి 2,300 లీటర్ల డీజిల్ గల ఇంజిన్‌తో కూడిన రైలును తమ డివిజన్‌లోకి అనుమతించ బోమని జైపుర్ డివిజన్ స్పష్టం చేసింది. ఆ రైలు గమ్యస్థానం చేరేందుకు దాని ఇంజిన్‌లో ఉన్న ఇంధనం సరిపోదని..దారిలో ఆగిపోతే ఇబ్బందులొస్తాయంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే తమ డివిజన్‌లో ఇంధనం నింపుకొనేందుకు అనుమతివ్వలేదు. దీంతో ఆగ్రా డివిజన్ చేసేది లేక రాత్రి 7.30 గంటలకు ఆ ఇంజిన్‌ను రైలు నుంచి విడదీయించి.. 100 కి.మీ. దూరంలోని మథుర స్టేషన్‌కు వెనక్కు రప్పించి.. ఇంధనాన్ని నింపించింది. అనంతరం తిరిగి వెళ్లిన ఇంజిన్‌ను వ్యాగన్లతో కలిపారు. చివరకు 10 గంటల తరువాత ఉట్‌వాడ్ స్టేషన్ నుంచి మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు ఆ గూడ్స్ రైలు జైపుర్‌కు బయలుదేరింది. ఈ ఘటనపై పరిశీలన జరుపుతామని రెండు డివిజన్లకు చెందిన అధికారులు చెప్పారు.

# కేంద్రం చేతిలో ఏపి ప్రభుత్వం కీలు బొమ్మ సీపీఎం ఏపీ కార్యదర్శి శ్రీనివాసరావు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (సమ సమాజం):** ఏపీ ప్రభుత్వం కేంద్రం చేతిలో కీలుబొమ్మలా తయారయ్యిందని సీపీఎం ఏపీ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. శనివారం నాడు సీపీఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..."అక్టోబర్ 30 తేదీ నుంచి ఏపీలో సీపీఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. ఈ యాత్రలో సీపీఎం రాజకీయ విధానాన్ని ప్రజలకు చెప్పడం, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అంశాలను ప్రజలకు చెప్పే కార్యాచరణతో ప్రజా రక్షణ భేరి కార్యచరణ ఉంటుంది. కర్నూలు జిల్లా ఆదోని, శ్రీకాకుళం జిల్లా ముందస, పార్వతిపురం జిల్లా సీతం పేట నుంచి విజయవాడ వరకు బస్సు జాతాలు జరగనున్నాయి. నవంబర్ 15 తేదీ విజయవాడలో ప్రజా రక్షణ భేరి సభ నిర్వహిస్తాం. విజయవాడ సభకు సీతారాం ఏచూరి, రాఘవులు హాజరుకానున్నారు. వామపక్ష పార్టీలతో కలిసి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం. 10 సంవత్సరాల్లో కేంద్రం ఏపీకి సంబంధించిన ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదు. ప్రత్యేక హామీలు, విశాఖ, కడప ఉక్కు పరిశ్రమల అంశాలను కేంద్రం పట్టించుకోలేదు. ఏపీకి కేంద్రం తీరని అన్యాయం చేస్తుంది. కేంద్రం అన్యాయం చేస్తుంటే రాష్ట్రంలో రాజకీయపార్టీలు మాట్లాడకపోవడం దురదృష్టకరం. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎందుకు ఎన్డీఏలో ఉన్నాడో చెప్పాలి. ఏపీకి ఏం చేసింది అని ఇంకా ఎన్డీఏలో పవన్ కళ్యాణ్ ఉంటున్నారు. బీజేపీ ఎన్డీఏను ఎందుకు పవన్ కళ్యాణ్ మోస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయని బీజేపీతో ఎందుకు చేతులు కలుపుతున్నారు. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాపడతారా బీజేపీ ముందు మోకరిల్లుతారా తేల్చుకోవాలి. అవినీతిని నిర్మూలించాలన్న ఆలోచన చిత్తశుద్ధి కేంద్రానికి లేదు. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను ఖండించాం. కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ విషయంలో నాటకం ఆడుతుంది. బీజేపీ వల్ల ప్రజాస్వామ్య హక్కులు హరించబడుతున్నాయి. బీజేపీని ఆదర్శంగా తీసుకుని వైసీపీ హక్కులను హరిస్తుంది. వైసీపీ సామాజిక న్యాయం పాటించడం లేదు. ఏపీలో దళితులపై దాడులు జరుగుతున్నాయి. సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు" అని వి శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆది వారం, 29. 10. 2023
www.samasamajam.in
సమ సమాజం



# పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మానవత్వం

**పశ్చిమగోదావరి,అక్టోబర్ 28(సమ సమాజం):** నిండు గర్భిణికి సహాయం చేసి పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మానవత్వం చాటుకున్నారు. గత అర్ధరాత్రి నిండు గర్భిణి పాలకొల్లు ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. అయితే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఏమి చేయాలో తెలియక కుటుంబసభ్యులు అయోమయస్థితిలో ఉండిపోయారు. చివరకు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకు గర్భిణి కుటుంబసభ్యులు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. ఆస్పత్రికి వచ్చి గర్భిణికి వైద్య సేవలు అందేలా బాధ్యత తీసుకున్నారు. బయటనుంచి డాక్టర్లను రప్పించి మరీ గర్భిణీకి వైద్య సేవలు అందజేశారు. దీంతో మహిళ పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డలను చూసి మీా ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని రామానాయుడు అన్నారు. ఎమ్మెల్యే రామానాయుడు సహాయానికి జన్మంతా రుణపడి ఉంటామని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



### చంద్రబాబుకు బదులు నన్ను జైల్ పెట్టండి

# మాగంటి బాబు

**ఏలూరు, అక్టోబర్ 28(సమ సమాజం):** టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు బదులు తనను రాజమండ్రి సెంట్రల్ జైలులో పెట్టాలని ఆ పార్టీ సీనియర్ నేత మాగంటి బాబు అన్నారు. శనివారం నాడు నూజివీడులో “బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ'' కార్యక్రమంలో భాగంగా టీడీపీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ “నాకు రాత్రి నిద్రిస్తుండగా కలలో స్వర్గీయ రాజశేఖరరెడ్డి ప్రత్యక్షమయ్యి కొడుకు జగన్మోహన్‌రెడ్డి ప్రవర్తనపై తీవ్రంగా బాధ పడ్డాడు. తండ్రి ఎన్టీఆర్ ముఖ్యమంత్రి సమయంలోనూ, భర్త ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలోనూ ఏనాడూ ఇంటి గుమ్మం దాటకుండా సేవా కార్యక్రమాలకే పరిమితమైన నారా భువనేశ్వరి నేడు నిజం గెలవాలి అంటూ ప్రజల్లోకి వచ్చారు. నారా భువనేశ్వరికి ప్రతి ఒక్కరూ తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. వయస్సు రీత్యా అనారోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని చంద్రబాబు నాయుడుకు బదులు తనను జైల్లో పెట్టాలని జగన్‌ను కోరుతున్నాను. రాత్రి నిద్రలో రాజశేఖరరెడ్డి కలలో కనిపించి, తండ్రి వయస్సులో ఉన్న చంద్రబాబు నాయుడుపై తన కొడుకు ప్రవర్తిస్తున్న తీరును తప్పు అని చెప్పి మంచి చెడులు సూచించాలని తనను కోరారు” అని మాగంటి బాబు ఎద్దేవ చేశారు.



## ప్యాలస్ విడిచి జనంలోకి రావాలి : ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

**విజయవాడ,అక్టోబర్ 28(సమ సమాజం):** ముఖ్యమంత్రి జగన్‌కు విజ్ఞప్తి ప్యాలస్ విడిచి జనంలోకి రావాలి అంటూ ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పొలాలు ఎడారులుగా మారుతున్న పరిస్థితి నెలకొందని.. ముఖ్యమంత్రి పొలం బాట పట్టాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితి వలన పొలాలు ఎండిపోయి రైతులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. పంట నష్టపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి కరువు మండలాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు తక్షణ సాయంగా లక్ష ఆర్థిక సాయం అందజేయాలన్నారు. పంట ఎండిపోయిన పొలాల రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కేంద్రం మెడలు వంచి హోదా తీసుకువస్తామని చెప్పి, కేంద్రం ముందు సాగిలా పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన చట్టం అమలైతే హోదాతో పాటు వెనుకబడిన ప్రాంతాలకు నిధులు వస్తాయన్నారు. రైతులను, ఆక్సిడెంట్ బాధితులను ఆదుకోవాలని ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాస్తున్నామనినారు. ఓబీసీ కులగణనపై రేపు గుంటూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కూడా ఓబీసీ కులగణనపై సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశాలకు ఏపీసీసీ, ఏఐసీసీ నాయకులు పాల్గొంటారని గిడుగు రుద్రరాజు వెల్లడించారు.



# బిఆర్ఎస్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్‌కు లేదు



**(మొదటి పేజి తరువాయి)** కేంద్రం అక్కసు పెంచుకుందన్నారు. బీఆర్ఎస్ పథకాలను కాంగ్రెస్ కాపీ కొట్టిందన్నారు. రైతు బంధు సృష్టికర్త కేసీఆర్ అని.. అలాంటి రైతులను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. ఖానాపూర్‌లో జాన్సన్‌ను గెలిపించాలని హరీష్ రావు కోరారు. జాన్సన్ తమ కుటుంబ సభ్యుడని.. అభివృద్ధి పూచీ తమదని అన్నారు. పోడు పట్టాలు రాని రైతులకు కూడా రైతు బంధు ఇస్తామన్నారు. బీజేపీ వాళ్ళు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని హరీష్ రావు ప్రశ్నించారు.

## ఇంట్లోకి చొరబడి మహిళ దారుణ హత్య



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (సమ సమాజం):** ముసుగు ధరించిన వ్యక్తులు ఒక ఇంట్లోకి చొరబడ్డారు. ఒక మహిళపై గన్స్‌తో కాల్పులు జరిపి హత్య చేశారు. కాల్పుల శబ్దం విన్న పొరుగువారు ఆ దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నించగా బైక్ వదిలి పారిపోయారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం రాత్రి 9 గంటలకు జైత్‌పూర్ ప్రాంతంలోని ఒక ఇంట్లోకి ముసుగులు ధరించిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు చొరబడ్డారు. ఆ ఇంట్లో నివసిస్తున్న 24 ఏళ్ల పూజా యాదవ్‌పై తుపాకులతో కాల్పులు జరిపారు. కాగా, కాల్పుల శబ్దం విన్న పొరుగువారు వెంటనే తమ ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. బైక్‌పై పారిపోతున్న ఇద్దరిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో వారు బైక్‌ను వదిలి పరుగులు తీసి తప్పించుకున్నారు. కాల్పుల్లో గాయపడిన పూజా యాదవ్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హంతకులకు చెందిన నంబర్ ప్లేట్ లేని బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి నిందితుల కోసం వెతుకున్నారు. పూజాను వారు ఎందుకు కాల్చి చంపారు అన్నదానిపై దర్యాప్తు చేస్తున్నారు.


## పదవుల కోసం దిగజారిన తుమ్మల మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



**(మొదటి పేజి తరువాయి)** ప్రశ్నించారు. తానే కేసీఆర్‌కు మంత్రి పదవి ఇప్పించినట్లు ఆరోపిస్తున్నారని అది చాలా హాస్యాస్పదమన్నారు. కేసీఆర్, తుమ్మల నాగేశ్వర రావు ఒకేసారి రాజకీయాల్లోకి వచ్చారని చెప్పారు. కేసీఆర్ వల్లే తుమ్మలకు మంత్రి పదవి వచ్చిందని తెలిపారు. గత ఎన్నికల్లో తుమ్మల ఓటమికి ఉపేందర్ రెడ్డికి డబ్బులు ఇచ్చినట్లు ఆరోపిస్తున్నారని విమర్శించారు. తుమ్మలకు టికెట్ ఇచ్చి ఓటమి కోసం డబ్బులిస్తారా అని ప్రశ్నించారు. అంతకన్నా ఆయనకు టికెట్ ఇవ్వకపోతే సరిపోయేది కదా అన్నారు. తుమ్మల నాగేశ్వరరావు ఎప్పుడూ జై తెలంగాణ అనలేదని విమర్శించారు. తెలంగాణ నినాదం చేసినవారిని జైలుపాలు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# కెసిఆర్ పాలనలో పూర్తిగా మారిన నాగార్జునసాగర్ రూపురేఖలు

### జానారెడ్డికి దీటుగా మారిన బిఆర్ఎస్ ◆ ఈసారి ఎన్నికల్లో ఆసక్తికర పోరు



**హైదరాబాద్, అక్టోబర్ 28(సమ సమాజం):** నాగార్జునసాగర్ నియోజకవర్గం 2009కు ముందు చలకుర్తి పేరుతో ఉండేది. 1983 నుంచి ఇప్పటివరకు నలభై ఏండ్లలో ముప్పై ఏండ్ల పాటు జానారెడ్డి ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నారు. టీడీపీ, కాంగ్రెస్ హయాంలో అనేక శాఖలకు మంత్రిగా పని చేశారు. కానీ, ఏనాడూ ఆయన నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదు. దీంతో జానారెడ్డి హయాంలో సాగర్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదు. 1983లో మంత్రి కాగానే ఆయన నియోజకవర్గాన్ని వదిలి హైదరాబాద్‌కు మకాం మార్చారు. అప్పటినుంచి ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారు. నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా, ఏ పని కావాలన్నా లోకల్ లీడర్లను పట్టుకొని ఓ కారు కిరాయికి మాట్లాడుకొని హైదరాబాద్‌లోని జానారెడ్డి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో క్రమంగా జానారెడ్డిపై సాగర్ ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. దీంతో 2018 ఎన్నికల్లో జానారెడ్డిపై బీఆర్ఎస్ అభ్యర్థి నోముల నర్సింహయ్యను గెలిపించారు. ఆయన మరణించడంతో 2021లో ఉపఎన్నిక వచ్చింది. ఆ ఎన్నికలో జానారెడ్డిపై నర్సింహయ్య కుమారుడు నోముల భగత్ బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. నాలుగు దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలను కేసీఆర్ ప్రభుత్వం పరిష్కరించింది. తిరుమలగిరి సాగర్‌ను మండలం చేసింది. హాలియా, నందికొండను మున్సిపాలిటీలుగా మార్చి రూ.70 కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పించింది. జానారెడ్డి హయాంలో గాలికొదిలేసిన హాలియాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, నిడమనూరులో కోర్టు ఏర్పాటు, పెద్దవూర మండలంలో వరదకాల్వ నిర్మాణం, తిరుమలగిరి సాగర్ మండలంలో డీ, 8, 9 కెనాల్స్ పరిధిలో ఉన్న 7 వేల ఎకరాలకు లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించడం వంటి అనేక సమస్యలను పరిష్కరించింది. తిరుమలగిరి సాగర్ మండలంలో 24,886 ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుగా నెల్లికల్లు లిఫ్ట్ ఏర్పాటుకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. రూ.692 కోట్లతో లిఫ్ట్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గత 50 ఏండ్లుగా ఎన్ఎస్‌పీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారి ఇండ్లను 58, 59 జీఓ కింద క్రమబద్ధీకరించింది. సాగర్‌లో రూ.18 కోట్లతో 100 పడకల దవాఖాన నిర్మాణం, డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది కేసీఆర్ ప్రభుత్వం. హాలియాలో రూ.3 కోట్లతో 50 పడకల దవాఖాన నిర్మించింది. నాగార్జున సాగర్ ప్రజలు ఏండ్లుగా అనుభవిస్తున్న సమస్యలను కేసీఆర్ ప్రభుత్వం పరిష్కరించింది. రూ.108 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇస్తున్నది. రూ.40 కోట్లతో మిషన్ కాకతీయ కింద 230 చెరువులు, కుంటలను బాగుచేయడంతో జలకళ వచ్చింది. భూగర్భ జలాలు పెరిగాయి. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తే బీఆర్ఎస్ కండువా కప్పుకుంటానని జానారెడ్డి నిండు అసెంబ్లీలో కేసీఆర్ ప్రభుత్వానికి సవాల్ విసిరి మడమతిప్పారు. రాష్ట్రమంతా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఇవ్వడమే కాదు సాగర్ నియోజకవర్గంలోనూ విద్యుత్తు వ్యవస్థను దారిలో పెట్టింది కేసీఆర్ ప్రభుత్వం. రూ.470 కోట్లలో 10 కొత్త విద్యుత్తు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ వ్యవస్థను మెరుగుపరిచింది. దీంతో లోఓల్టేజీ సమస్య పరిష్కారమయ్యింది. 20 ఏండ్లుగా అసంపూర్తిగా ఉన్న ఏఎంఆర్‌పీ లోలెవల్ కెనాల్(వరదకాల్వ)ను పూర్తిచేసి 30 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నది. రూ.72 కోట్లతో గొప్పగా బుద్ధవనాన్ని నిర్మించడంతో పర్యాటకంగానూ సాగర్ అభివృద్ధి చెందింది. ఈ ఎన్నికల్లో సాగర్‌లో ఇద్దరు యువ నేతల మధ్య పోటీ నెలకొన్నది. బీఆర్ఎస్ నుంచి మరోసారి సిట్టింగ్ ఎమ్మెల్యే నోముల భగత్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ తరపున జానారెడ్డి తన కుమారుడు జయవీర్‌రెడ్డిని పోటీ చేయిస్తున్నారు. 2018, 2021ల్లో జానారెడ్డిని ఓడించిన సాగర్ ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించారు. నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరగడం, నోముల భగత్ ప్రజలకు అందుబాటులో ఉండటంతో మళ్లీ బీఆర్ఎస్‌నే గెలిపించాలని సాగర్ ప్రజలు భావిస్తున్నారు.

## సిఎం కెసిఆర్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే నవ్వొస్తోంది : పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**(మొదటి పేజి తరువాయి)** కేసీఆర్‌కు ఛాలెంజ్ చేస్తున్న.. తడిబట్టలతో ఏ గుడికి వస్తారో రండి.. నాకు ఏ పైరవీలు చేశారు... ఏ కాంట్రాక్టులు ఇచ్చారో చెప్పండి.. నేను కూడా తడి బట్టలతో అదే గుడికి వస్తా”నని పొంగులేటి సవాల్ చేశారు. పాలేరులో దళిత బంధు గురించి మాట్లాడుతున్నారని, హుజూరాబాద్‌లో గెలవటం కోసం ప్రకటించారని, అక్కడ ఏం జరిగిందో ప్రజలు చూశారన్నారు. ఓట్లు వేయకపోతే రెస్టు తీసుకుంటామని సీఎం అంటున్నారని.. ఇప్పుడు మటుకు చేసేది ఏముంది? కేవలం సోల్లు కబుర్లు చెబుతూ జనాన్ని మోసం చేయటమే కదా అని సెటైర్లు వేశారు. అక్రమంగా సంపాదించిన డబ్బు నోట్ల కట్టలతో వస్తున్నానని సీఎం కేసీఆర్ అంటున్నారని, తాను కష్టపడి సంపాదించిన డబ్బు అని అధికారికంగా చెప్పగలనని పొంగులేటి అన్నారు. మరి ముఖ్యమంత్రి ఏ వ్యాపారం చేశారని, లక్షల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ధనిక రాష్ట్రం తెలంగాణను దోచుకుని దాచుకున్నారని ఆరోపించారు. ఇంత నీచమైన రాజకీయ నాయకుడిని ఎక్కడ చూడలేదన్నారు. మేడిగడ్డ పరిస్దితి ఏమైందని ప్రశ్నించారు. మేడిగడ్డ కేసీఆర్ ఏటిఎంగా మారిందని ప్రధాని మోదీతో సహా అందరూ చెప్పారన్నారు. సీఎం కేసీఆర్ పతనానికి మేడిగడ్డ చివరి మెట్టని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## రూ. 20 కోట్లు ఇవ్వకుంటే చంపేస్తాం



**(మొదటి పేజి తరువాయి)** ఆ మెయిల్‌లో తెలిపారు. షాదాబాద్ ఖాన్ పేరుతో ఉన్న మెయిల్ నుంచి అక్టోబర్ 27వ తేదీన బెదిరింపు వచ్చింది. ఆంటిలియాలోని అంబానీ నివాసానికి చెందిన సెక్యూర్టీ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఫిర్యాదు నమోదు చేశారు. ముంబైలోని గామ్‌దేవి పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. ఐపీసీ 387, 502(2) సెక్షన్ల కింద కేసును బుక్ చేశారు.

## ఆవుపేడ కొంటాం.. ల్యాప్‌టాప్‌లు ఇస్తాం!

**జైపూర్, అక్టోబర్ 28(సమ సమాజం):** రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఓటర్లపై వరాల వర్షం కురిపిస్తున్నారు. ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న వేళ తాజాగా మరో 5 హామీలు ఇచ్చారు. కాంగ్రెస్‌ని తిరిగి గెలిపిస్తే ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థులకు ట్యాబ్ లేదా ల్యాప్‌టాప్ ఇస్తామని హామీ ఇ చ్చారు. జైపుర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన కాంగ్రెస్ 5 గ్యారెంటీలను ప్రకటించారు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వమూ మార్చేందుకు అవకాశం లేకుండా పాత పింఛను విధానాన్ని అమలు చే సేలా చట్టం చేస్తామన్నారు. ‘గో ధన్’ పథకం కింద కిలో ఆవుపేడ రూ.2 చొప్పున ధరకు కొనుగోలు చేస్తామని చెప్పారు. ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు ఏర్పాటు చేస్తామని, ప్రకృతి వైపరీత్యాల్లో నష్ట పోతే రూ.15 లక్షల బీమా కల్పిస్తామని హామీలు ఇచ్చారు.

# ఎన్నికల వేళ గుర్తుల మాయ!

**(మొదటి పేజి తరువాయి)** ‘ఆవుదూడ’ గుర్తును కేటాయించింది. కాంగ్రెస్ మరోసారి చీలిపోయి ఇందిరా కాంగ్రెస్ ఏర్పాటైంది. అప్పుడు 1978లో ఇందిరా కాంగ్రెస్‌కు ‘చేయి’ గుర్తు లభించింది. అప్పటి నుంచి అదే కొనసాగుతోంది.

# సామాన్యులకు గుదిబండగా నిత్యావసరాలు

**(మొదటి పేజి తరువాయి)** పలుకుతున్నది. ఈ రోజు ఐదు కిలోలకు రూ.350కి చేరిందని ఘాజీపూర్ కూరగాయల మార్కెట్‌లోని ఓ ఉల్లిగడ్డ వ్యాపారి చెప్పారు. నిన్న అది రూ.300లు ఉందని చెప్పారు. అంతముందు రోజు రూ.200గా ఉండేదని తెలిపారు. వారం రోజులుగా ఉల్లిగడ్డ ధరలు పెరుగుతూ వస్తున్నాయని చెప్పారు. ఉత్పత్తి తక్కువగా ఉండటమే దీనికి కారణమన్నారు. రానున్న రోజుల్లో ఉల్లిగడ్డల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మరో వ్యాపారి చెప్పారు. నవరాత్రి ముందు రూ.50గా ఉన్న కిలో ఉల్లిగడ్డ ధర ఇప్పుడు రూ.70 చేరిందన్నారు. తమకే రూ.70కి పడుతుండటంతో వినియోగదారులకు రూ.80కి అమ్ముతున్నామని చెప్పారు. గతంలో కిలోకు రూ.30 నుంచి 40 మధ్య ఉందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే కిలో రూ.100కు చేరుతుందని తెలిపారు. ఉల్లిగడ్డతోపాటు టమాట ధరలు కూడా పెరుగుతున్నాయని ఆయన అన్నారు. గతంలో కిలోకు రూ.20గా ఉన్న టమాట.. ప్రస్తుతం రూ.40 నుంచి 45 పలుకుతుందని చెప్పారు. ఇలాగే పెరుగుతూపోతే రూ.70 వరకు చేరే అవకాశం ఉందని తెలిపారు.



## ఉల్లి ధరల రెక్కలు కత్తిరించిన కేంద్రం



**(మొదటి పేజి తరువాయి)** టన్నుల ఉల్లిని విడుదల చేసినట్టు వివరించారు. ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ ఆధ్వర్యంలో దుకాణాలు, వాహనాల ద్వారా సబ్సిడీ ధరకు ఉల్లిని అందుబాటులో ఉంచుతున్నారు.

# ఈ శ్రామిక మహిళలకు కూర్చునే హక్కు కూడా లేదా!



కొందరి సమస్యలు ..చూసే వారికి పెద్ద సమస్యగా అనిపించదు. కొన్ని కష్టాలు చూస్తే తెలియదు ..అనుభవిస్తేనే అర్థమవుతుంది. షాపింగ్ మాల్స్‌లో రోజంతా నిల్చుని పనిచేసే శ్రామిక మహిళలు పడే ఇబ్బందులు కూడా అలాంటివే. చిరునవ్వుతో కస్టమర్లకు ఆహ్వానాలు పలుకుతారు. కానీ, ఆ నవ్వుల వెనుక ఎంతటి విషాదం ఉందో తెలిస్తే హృదయాలు బరువెక్కక మానవు. ఇప్పుడు పండగ ల సీజన్ నడుస్తోంది.. దేశమంతా పండుగల సంబరాలే కానీ ఆ మాల్స్‌లో పని చేసే మహిళలకు పండగ పూట కుటుంబంతో కలిసి భోంచేసే అదృష్టం కూడా లేదు. ఇంతకూ వారి సమస్యలేంటో చూద్దాం.. షాపింగ్ మాల్స్, బట్టల షాపులు, పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లలో పనిచేసే మహిళలు ఎప్పుడూ నిల్చునే కనిపిస్తారు. పక్కన కనీసం కూర్చోవడానికి స్టూలుకానీ, కుర్చీ కానీ కనపడదు. ఇవేవీ మనకు పట్టదు. ఉదయం 9 గంటలకు డ్యూటీకి వచ్చింది మొదలు రాత్రి 9 గంటలకు డ్యూటీ దిగేంత వరకు సుమారు 12 గంటల పాటు కంటిన్యూగా నిలబడే ఉండాల్సిన ఉద్యోగం వారిది. మహిళలు షాపింగ్‌మాల్స్‌లో కూర్చునే హక్కును కల్పిస్తూ దేశంలో మొట్టమొదటిసారిగా కేరళ రాష్ట్ర ప్రభుత్వం చట్టం తెచ్చింది. ఆ తరువాత తమిళనాడు ప్రభుత్వం కూర్చునే హక్కును కల్పిస్తూ చట్టం చేసింది. కేరళ చట్టంలో ప్రతి కార్మికునికి వారానికి ఒకరోజు సెలవుదినంగా ఇవ్వాలని, మహిళా కార్మికులను రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు పని చేయించరాదని పేర్కొన్నది. తప్పనిసరి పరిస్థితులు ఎదురైనప్పుడు ఐదుగురు కార్మికులు ఓ గ్రూపుగా ఉండాలి. అందులో ఇద్దరు మహిళలు ఉండాలి. వారికి తగిన రక్షణ కల్పించాలి. ఇంటి వరకూ రవాణా సౌకర్యం కల్పించాలని చెప్పబడింది. షాపుల్లో నిలబడి పని చేసే వారికి వారి పని ప్రదేశాలలో కూర్చోవటానికి సౌకర్యం కల్పించాలని స్పష్టంగా చట్టంలో వివరించబడింది. మన రెండు తెలుగు రాష్ట్రాలలో ఇది హక్కుగా, చట్టంగా లేకపోవడం విచారకరం. తక్షణం ఈ సమస్యపై రెండు ప్రభుత్వాలు చట్టం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో వందలాది షాపింగ్ మాల్స్, జ్యూవెలరీ మార్టులున్నాయి. వీటిలో వేలాది మంది శ్రమజీవులు ఉపాధికై పని చేస్తున్నారు. వీరికి కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు ఇవ్వటం లేదు. గంటలకొద్దీ నిలబడటం వల్ల ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయి. అత్యధిక చోట్ల మహిళలకు కూర్చునే సౌకర్యం లేదు. కస్టమర్లు లేనప్పుడు కూడా కూర్చునేందుకు లేదు. ఈ మహిళలకు నిలబడి ఉండటం కారణంగా మూత్రాశయ వ్యాధులు, కాళ్లపై వెరికోస్ వెయిన్స్ (నరాలు ఉబ్బటం) వ్యాధి, వెన్నుపూస, నడుమునొప్పి వంటి సమస్యలు చిన్న వయసులలోనే వస్తున్నాయి. కొన్ని మాల్స్‌లో 10 నిమిషాలు మాత్రమే వాష్‌రూమ్‌కు వెళ్లాలనే నిబంధన ఉంది. బాత్‌రూమ్‌కు వెళ్లిన ప్రతిసారి బయోమెట్రిక్‌లో నమోదు చేయాలి. కార్మికులు లిఫ్ట్ ఎక్కడానికి వీలు లేదు. ఎన్ని సార్లయినా, ఎన్ని అంతస్తులైనా మెట్లపై నడవాల్సిందే. పీరియడ్స్ సమయంలో మహిళల బాధ వర్ణనాతీతంగా ఉంటుంది. కార్మికులకు భోజనాలు చేయడానికి సౌకర్యాలు లేవు. టాప్ఎ÷-లోర్‌లో వాష్‌రూముల దగ్గర భోజనాలు చేస్తుంటారు. వీరికి పని ఎక్కువ, వేతనం తక్కువ. కొనుగోలుదార్లు చూసిన బట్టలు, వస్తువులను సర్దటమే వీరి ప్రధాన పని. రూ.6 వేల నుంచి 14 వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు. పెద్ద మాల్స్‌లో కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్‌లు అమలు చేస్తున్నా పని గంటలు చట్ట ప్రకారం అమలు చేయటం లేదు. కార్మికులకు ప్రోత్సాహకాలు, బోనస్ పేరుతో పోటీ పెంచుతున్నారు. ఒక్కో అంతస్తులో ప్రతి రోజూ 'మంచి ఉద్యోగి' పేరిట ఎంపిక చేస్తారు. ఇందుకోసం అమ్మకాలు పెంచాలంటూ విపరీత మైన టార్చర్ ఉంటుంది. తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా 8 గంటల పని విధానం అమలు కావటం లేదు. 10 నుంచి 12 గంటలపాటు కనీసంగా వీరు పని చేయాల్సి వస్తున్నది. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు రోజులో రాక పోకలు కలుపుకుంటే 14 నుంచి 16 గంటలు ఈ పనిలో ఉండాల్సి వస్తున్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెలవులు అమలు కావటం లేదు. ఒక్కరోజు సెలవు తీసుకుంటే రెండు రోజుల వేతనాన్ని కత్తిరిస్తున్నారు.కేరళ, తమిళనాడు తరువాత దేశంలో ఎక్కడా ఇది చట్టంగా రూపుదాల్చలేదు. మహిళోద్ధారకులు గా తమను తాము కీర్తించుకునే తెలుగు ముఖ్యమంత్రులకు ఈ సమస్య పట్టడంలేదు. విజయవాడ, విశాఖ, తిరుపతి, రాజమండ్రి, కాకినాడ లాంటి నగరాలలో వీరి సంఖ్య వేలల్లో ఉంటుంది. ఇక, పని ప్రదేశంలో లైంగిక వేధింపుల సమస్య కూడా తీవ్రమైన అంశంగా ఉంది. తక్షణం వీరి సమస్యలకు పరిష్కారాన్ని చూపించాల్సిన బాధ్యత ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రభుత్వాలపై ఉంది..

# గాజా నరమేధంపై ట్విటర్‌లో ప్రియాంక ఆవేదన



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28(సమ సమాజం):** పాలస్తీనాలోని గాజాలో కొనసాగుతున్న రక్తపాతం, తీవ్ర హింసాత్మక ఘటనలపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉల్లంఘనకు గు రికాని అంతర్జాతీయ చట్టం కానీ, నిబంధన కానీ ఒక్కటీ లేదన్న విషయం ప్రస్తుతం అక్కడ జరుగు తున్న పరిణామాలను బట్టి తేటతెల్లమవుతోందన్నారు. 'ఎందరు చిన్నారులు ప్రాణత్యాగం చేయాలి? ఇంకెందరు మరణించాలి? మానవత్వం అనేది ఉందా? మానవత్వం మేల్కొనేది ఇంకెప్పుడు?అని ఆమె 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. గాజాలో మూడు వేల మంది అమాయక చిన్నారులు సహా మొత్తం ఏడు వేల మందికిపై ప్రాణాలు కోల్పోయినప్పటికీ రక్తపాతం, హింసకు పుల్‌స్టాప్ పడకపోవ డంపై ప్రియాంకా గాంధీ తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు.

# పశ్చిమ బెంగాల్ మంత్రి జ్యోతిప్రియో మల్లిక్ అరెస్టు



**కోల్‌కతా, అక్టోబర్ 28(సమ సమాజం):** రేషన్ సరుకుల కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో పశ్చిమ బెంగాల్ అటవీ మంత్రి, టీఎంసీ నేత జ్యోతిప్రియో మల్లిక్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరె క్టరేట్(ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. దాదాపు 18 గంటలపాటు ప్రశ్నించిన అనంతరం శుక్రవా రం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మల్లిక్‌ను వైద్య పరీక్ష ల కోసం ఆసుపత్రికి తరలించారు. మల్లిక్‌ను కోర్టులో ప్రవేశపెట్టి, తదుపరి విచారణ కోసం కస్టడీ కోరుతామని చెప్పారు. 18 గంటలపాటు ప్రశ్నించినా నోరువిప్పలేదని, విచారణకు సహకరించలేద ని అన్నారు. కాగా, మంత్రి మల్లిక్‌ను అధికారులు కోర్టులో ప్రవేశపెట్టిన సమయంలో ఆయన హఠా త్తుగా అస్వస్థతకు గురై కుప్పకూలినట్లు తెలిసింది. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. న్యాయస్థానం ఆయనను 10 రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# పటాన్ చెరు కాంగ్రెస్ పార్టీ టికెట్ నీలం మధుకా !?, కాట శ్రీనివాస్‌కా..!?

- నీలం మధు ముదిరాజ్ కే టికెట్ అంటూ సోషల్ మీడియాలో అనుచరుల ప్రచార జోరు
- గడిచిన తొమ్మిది ఏళ్లుగా పార్టీని కార్యకర్తలను తన బుజాలపైన మోసిన కాట శ్రీనివాస్ గౌడ్ కే టికెట్ అంటూ కార్యకర్తల ఆశాభావం





**పఠాన్‌చెరు, అక్టోబర్ 28 (సమసమాజం):** 2023 ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు100 మంది పేర్లను ప్రకటించగా,ఇంకా 19 మంది పేర్లను ప్రకటించాల్సి ఉండగా దానిలో పఠాన్ చెరు కాంగ్రెస్ అభ్యర్థి అటు నీలం మధు,ఇటు కాట శ్రీనివాస్ గౌడ్ వీరిద్దలో పార్టీ టికెట్ ఎవరికి ఇస్తుంది అనేది హాట్ టాపిక్‌గా మారింది..పఠాన్‌చెరుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ముది రాజుల ఆదరణ, సంబంధ వర్గాల ఆదరణ నీలం మదుకే ఉందని గట్టి సంకల్పంతో నీలం మధు ముదిరాజ్ వర్గం మధుకి టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం బీఫామ్ లేటుగా ఇచ్చిన తొమ్మిది రోజుల వ్యవధిలో ప్రచారం నిర్వహించి 80 వేల ఓటు బ్యాంక్ ఉన్న కాట శ్రీనివాస్ కే ఈ సారి కూడా బి ఫామ్ అని కాటా శ్రీనివాస్ గౌడ్ కె టికెట్ వస్తుందని వారి వారి వర్గాల వారు అభిప్రాయ పడు తున్నారు. ఏది ఏమైనా వారి వారి వర్గాల గుండెల్లో గుబులు పుడు తుంది. త్వరలో ఏఐసిసి ప్రకటించబోయే మూడవ లీస్టులో పఠాన్ చెరు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు అనేది ఆసక్తిగా మారింది. అధిష్టానం జోక్యంతో ఇద్దరు కలిసిపోయి ఒకరు టికెట్ త్యాగం చేస్తే.. గూడెం మహిపాల్ రెడ్డికి ఈసారి ఎమ్మెల్యేగా గెలవడానికి కష్టాలు తప్పవని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# దేశంలో పెరుగుతున్న నిరుద్యోగుల ఆత్మహత్యలు

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 28(సమ సమాజం):** దేశంలో ప్రతి యేటా నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా ప్రకారం 2019లో దేశవ్యాప్తంగా 1,39,123 మంది ఆత్మహత్యలు చేసుకోగా, వీటిలో 14,019 మంది నిరుద్యోగులే. 2018లో 1,34,516 మంది ఆత్మహత్య చేసుకోగా, వీరిలో 12,936 (9.6 శాతం) నిరుద్యోగులు. 2017లో 1,29,788 మంది ఆత్మహత్య చేసుకోగా, అందులో 12,241 (9.4 శాతం) మంది నిరుద్యోగులు. 2016లో 1,31,008 మంది ఆత్మహత్యలు రికార్డ్ కాగా, అందులో 11,173 మంది (8.5 శాతం) నిరుద్యోగులు. 2015లో ఆత్మహత్య చేసుకున్న వారిలో నిరుద్యోగుల శాతం 8.2 కాగా, 2014లో 7.5 శాతముంది. కాగా, 2021లో రైతుల ఆత్మహత్యల సంఖ్య 10,881 ఉంటే...ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య 13,089 ఉందని పార్లమెంట్ స్థాయి సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి రాజకీయ పార్టీలు సరైన పరిష్కార మార్గాలు చూపలేకపోతు న్నాయి. ప్రభుత్వాలు ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. ప్రయివేటు రంగంలో నూ కనీస వేతనాలు అమలయ్యేలా చూడాలి.

# చంద్రబాబుతో కుటుంబ సభ్యుల ములాఖత్

**రాజమండ్రి,అక్టోబర్ 28(సమ సమాజం):** స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో అక్రమంగా అరెస్ట్ అయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును కుటుంబసభ్యులు కలిశారు. శనివారం ఉదయం ములాఖత్‌లో చంద్రబాబును కుమారుడు నారా లోకేశ్, సతీమణి నారా భువనేశ్వరి కలిశారు. వీరితో పాటు తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ చంద్రబాబుతో ములాఖత్ అయ్యారు. ఏసీబీ కోర్టు జడ్జికి చంద్రబాబు లేఖ రాసిన నేపథ్యంలో కుటుంబసభ్యుల ములాఖత్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# 55 ఏళ్లపాటు కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే ఏం చేసింది




(మొదటి పేజీ తరువాయి) ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానమిచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు కర్ణాటకను మోడల్‌గా చూపిస్తున్నారని, అక్కడ 5 గంటల కరెంటు కూడా ఇవ్వడం లేదన్నారు. కన్నడ రైతులు ఇక్కడికి వచ్చి ఆందోళన చేస్తున్నారని చెప్పారు. కర్ణాటకకు వెళ్లి రైతుల పరిస్థితిపై ఆ రా తీద్దాం సిద్ధమా అని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. గత ఎన్నికల్లో బీజేపీ 105 సీట్లలో డిపాజిట్లు కోల్పోయిందని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో కూడా 110 స్థానాల్లో ఆ పార్టీకి డిపాజిట్లు రావని స్పష్టం చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు డిమాండ్ ఎప్పటినుంచో ఉందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీ జనగణన ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. తాము ప్రజలను నమ్ముకున్నామని.. పోల్ మేనేజ్‌మెంట్లను కాదన్నారు. ప్రజా రవాణాకు ప్రాధాన్యమిస్తున్నారు. హైదరాబాద్ మెట్రోను పూర్తి చేసిందే తామని చెప్పారు. మైనార్టీల సంక్షేమానికి అధిక కేటాయింపులు చేశామన్నారు. మైనార్టీల కోసం ఏటా రూ.వెయ్యి కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. భవిష్యత్ తరాన్ని పటిష్టం చేయాలనేది బీఆర్ఎస్ తాపత్రయమని చెప్పారు. కేంద్రానికి రూపాయి కడితే 46 పైసలు చెల్లిస్తున్నారని విమర్శించారు. మిగతా నిధులు వివిధ రాష్ట్రాల్లో రోడ్లకు వెచ్చిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఇచ్చింది గుండు సున్నా అని, తీసుకున్నది ఎక్కువని చెప్పారు. తాము ప్రజలకు ప్రగతి నివేదికలు సమర్పిస్తున్నామని చెప్పారు.

# వచ్చే ఎన్నికలల్లో బిజెపి కాంగ్రెస్ కనుమరుగు

(మొదటి పేజీ తరువాయి) మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో గిరిజనుల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. రూ.వెయ్యి ఇచ్చి గుడుంబా పోస్తే ఓట్లేసేవారు గిరిజనులనే అహంకారపూరిత మాటలు కాంగ్రెస్ నాయకులవని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గిరిజనులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అంటే నయవంచన అని, బీఆర్ఎస్ అంటే ఒక నమ్మకమన్నారు. ఆ పార్టీని నమ్మితే మోసపోతామన్నారు. రైతులు, పింఛన్‌దారులకు కేసీఆర్ భరోసా అని, అందుకే బీఆర్ఎస్ పథకాలను కాంగ్రెస్ కాపీకొడుతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ అద్భుతమైన మేనిఫెస్టోతో ప్రజల్లోకి వెళ్తున్నదని చెప్పారు. రైతు బంధు సృష్టికర్త సీఎం కేసీఆర్ అని, వచ్చేసారి 16 వేలు ఇస్తామన్నారు. గత ప్రభుత్వాలు రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే, సీఎం కేసీఆర్ రైతులకు డబ్బులు ఇస్తున్నారని చెప్పారు. తెల్ల రేషన్‌కార్డులు ఉన్న వారికి 6 కిలోల సన్నబియ్యం ఇస్తామన్నారు. రైతు బీమా లాగానే, కోటి కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అందిస్తామని, బీఆర్ఎస్ గెలిచాక ఆసరా పింఛన్లను రూ.5 వేలు చేస్తామని తెలిపారు. ఆరోగ్య శ్రీ ద్వారా 15 లక్షల చికిత్స ఉచితంగా అందిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్‌ను 11 సార్లు గెలిపిస్తే వ్యవసాయాన్ని దండుగ చేశారని, 11 సార్లు రైతుబంధు ఇచ్చి సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా చేశారన్నారు.




# హారన్ కొడితే హత్యాయత్నం చేస్తారా : నారా లోకేశ్

(మొదటి పేజీ తరువాయి) పట్టపగలు వైసీపీ నేతలు గూండాల కంటే ఘోరంగా దాడి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ సైకో జగన్ ఫ్యాక్షన్ ప్రదేశ్‌గా మారిపోయిందన్నారు. సైకో జగన్ పోతేనే, ఇలాంటి పిల్ల సైకో గ్యాంగులన్నీ పోతాయని, రాష్ట్రానికి పట్టిన పీడ విరగడవుతుందని లోకేష్ అన్నారు. నెల్లూరు జిల్లా, కావలిలో దారుణం చోటుచేసుకుంది. నెల్లూరు జిల్లాలో శాంతి భద్రతలు అదుపుతప్పాయి. రౌడీమూఖలు పెట్రేగిపోతున్నాయి. బైకు అడ్డంగా ఉండగా హారన్ మోగించారని ఆర్టీసీ డ్రైవర్లపై మూకుమ్మడిగా దాడి చేసి, హత్యాయత్నం చేశారు. జాతీయ రహదారి నడిరోడ్డులో బస్సును కారుతో అడ్డగించి దాష్టీకం ప్రదర్శించారు. ఆర్టీసీ డ్రైవర్ బీఆర్ సింగ్‌ని రోడ్డుపై పడేసి కాళ్లతో తన్నుతూ రౌడీలు రెచ్చిపోయారు. అడ్డొచ్చిన వారిని, వీడియోలు తీయబోయిన వారిపైనా దాడి చేసి.. చంపి పాతిపెడతామంటూ హెచ్చరించారు. ఎవరొస్తారంటూ తీవ్రస్థాయిలో దుర్భాషలాడారు. ఈ ఘటనలో దేవరకొండ సుధీర్‌తో పాటు పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల అరెస్టులో జాప్యం జరిగింది. దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in